ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	35	28

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం

రూ.90.90 లక్షలు

- 7లో



మండపేట సూర్య కన్వెన్షన్ హాలులో వలంటీర్లతో వైసీపీకి జేజేలు కొట్టిస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వైసీపీ కేడర్‌ను పక్కన పెట్టి వలంటీర్లవైపే మొగ్గుచూపుడంతో ఆ పార్టీలో రాజకీయ చిచ్చు ప్రారంభమైంది. కొన్ని ప్రాంతాల్లో వైసీపీ తరపున పోటీలో ఉన్న అభ్యర్థులు వలంటీర్లతో రాజీనామాలు చేయించి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేలా చూస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో వలంటీర్లు నేరుగా వైసీపీ అభ్యర్థుల ప్రచారాలు, జన సమీకరణ, ఇతర కార్యక్రమాల్లో బహిరంగంగానే పాల్గొంటున్నప్పటికీ వారిపై ఎటువంటి ఫిర్యాదులు లేకపోవడంతో అధికారులు సైతం ప్రేక్షక పాత్ర వహించాల్సి వస్తోంది.

వైసీపీ సేవే పరమావిధి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

- ఆ పార్టీ సేవలో తరిస్తున్న సచివాలయ వలంటీర్లు
- సీఎం జగన్ కోసం పని చేస్తామని ప్రకటన
- మండపేటలో తోట త్రిమూర్తులు ఆత్మీయ సమావేశానికి 900 మంది హాజరు
- అందులో 800 మంది రాజీనామా... పత్రాలు వైసీపీ శ్రేణులకు అందజేత

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత ఎన్నికల కమిషన్ అధికారులు కొన్ని రోజుల పాటు వలంటీర్ల కార్యకలాపాలపై నిఘా పెట్టి వారిని విధుల నుంచి తొలగించారు. ఆ తర్వాత వలంటీర్లపై కొరడా ఝుళిపించింది. రాజీనామాలతో సంబంధం లేకుండా ఇప్పటికే సచివాలయాల పరిధులు దాటి వేర్వేరు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాల్లో, జన సమీకరణల్లో వలంటీర్లు విధులు నిర్వర్తిస్తూనే ఉన్నారు. అధికారులు సైతం ఈ వ్యవహారాలను చూసీచూడనట్టు వదిలేస్తుండడంతో కొన్ని రోజులుగా వైసీపీ నేతలు వలంటీర్లతో రాజకీయ వ్యవహారాలను మరింత ముమ్మరం చేశారు.

ఈ నేపథ్యంలో మండపేటలోని సూర్య కన్వెన్షన్ హాలులో మండపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వలంటీర్లతో వైసీపీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు సోమవారం బహిరంగంగా ఓ సమావేశాన్ని నిర్వహించి ఎన్నికల్లో వలంటీర్లు అనుసరించాల్సిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. వెయ్యి మందికి పైగానే హాజరయ్యారు. ఫార్మేట్ రూపంలో రాజీనామా చేసినప్పటికీ వాటిని సంబంధిత అధికారులకు అందజేయకుండానే వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు నిర్వహించిన సభకు హాజరై ఎన్నికల ప్రణాళికలపై చర్చించారు. పార్టీపరంగా కూడా జీతభత్యాలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

కాగా కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు సుమారు 850 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి వైసీపీ సేవలో తరిస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో కూడా వలంటీర్లు ఇటీవల రాజీనామా చేశారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన వలంటీరు భూమన సతీష్ సోమవారం తన ఉద్యోగానికి రాజీనామా చేసి కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు సమక్షంలో టీడీపీలో చేరారు.

మండపేటలో అభ్యర్థి తోట త్రిమూర్తులు వలంటీర్లతో నిర్వహించిన సభ ఇప్పుడు ఎన్నికల అధికారుల వైఫల్యాన్ని వెలుగులోకి తెచ్చింది. ఎటువంటి అనుమతి లేకుండా ప్రభుత్వ విధుల్లో ఉన్న వలంటీర్లతో సమావేశం నిర్వహించడంతో పాటు వారికి విందు భోజనాలు ఏర్పాటు చేయగా వైసీపీ అభ్యర్థి స్వయంగా వడ్డించారు. ఈ వ్యవహారంపై ఎన్నికల అధికారులను మీడియా వివరణ కోరగా... వలంటీర్ల సమావేశం మండపేట మున్సిపాలిటీ పరిధిలో జరిగినందున కమిషనరు వారిపై చర్యలు తీసుకుంటారని ముక్తసరిగా బదులిచ్చారు. ప్రస్తుతం కల్యాణ మండపం నిర్వాహకులతో పాటు వైసీపీ నేతలకు నోటీసులు ఇచ్చే పనిలో మండపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారులు ఉన్నారు. వలంటీర్లు ఏయే ప్రాంతాల నుంచి ఎంత మంది హాజరయ్యారు. వారు విధులు ఎక్కడ నిర్వర్తిస్తున్నారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. కొందరు రాజీనామా చేయగా మరికొందరు రాజీనామాలు ఇవ్వకుండానే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ తరహా వ్యూహాన్ని వైసీపీ నేతలు అమలు చేయడం ద్వారా వలంటీర్లను ఎన్నికల ప్రచారం, పోలింగ్ ఏజెంట్లు గాను వినియోగించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. మరోపక్క ఎండలు మండిపోతుండడంతో ప్రచారానికి వైసీపీ శ్రేణులతో పాటు కూలీలు సైతం దూరంగా ఉంటున్నారు. దీంతో వలంటీర్లనే నెల పాటు పార్టీ విధుల్లోకి మళ్లించి వినియోగించుకునేలా వ్యూహరచన చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకు వలంటీర్లు కూడా సూచనప్రాయంగా సహకారం అందిస్తున్నారనడానికి మండపేటలో జరిగిన సమావేశమే అద్దంపడుతోంది. ఇక మిగిలిన చోట్ల జంబ్లింగ్ విధానంలో వలంటీర్లు పక్క ప్రాంతాలకు వెళ్లి పార్టీ అభ్యర్థుల సేవలో తరలిస్తున్నారు. అయితే ఈ పరిణామాలు అటు ఎన్నికల అధికారులకు మింగుడుపడడం లేదు. వలంటీర్ల వ్యవహారంపై ఎన్నికల కమిషన్ కఠినమైన ఆంక్షలు విధించాలని ఆదేశాలిచ్చినప్పటికీ వాటి అమలు ఇక్కడ అంతంతమాత్రంగానే అమలవుతోంది.



వలంటీర్లకు స్వయంగా భోజనాలు వడిస్తున్న తోట త్రిమూర్తులు



వైసీపీ శ్రేణులకు రాజీనామా పత్రాలు ఇస్తున్న వలంటీర్లు

జగన్, తోట గెలుపునకు 'మేం సిద్ధం'

వలంటీర్ల ప్రకటన... ఫిర్యాదుతో రంగంలోకి అధికారులు

మండపేట, ఏప్రిల్ 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని సూర్య కన్వెన్షన్ హాలులో నియోజకవర్గ పరిధిలోని సచివాలయ వలంటీర్లతో ఎమ్మెల్సీ, మండపేట అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండపేట అర్బన్, రూరల్‌లకు సంబంధించిన సుమారు 900 మంది వలంటీర్లు హాజరయ్యారు. వారంతా సీఎం జగన్, ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు విజయం కోసం పనిచేస్తామని ప్రకటించారు. అందుకు తామంతా రాజీనామాలకు సిద్ధమన్నారు. తోట త్రిమూర్తులు మాట్లాడుతూ వలంటీర్లకు అండగా ఉంటానని, వారి బాధ్యత తనది అని భరోసా ఇచ్చారు. తన కోసం, సీఎం జగన్ గెలుపు కోసం రాజీనామాలకు సిద్ధపడ్డ వలంటీర్లను తోట అభినందించారు. ఎన్నికల తర్వాత తిరిగి విధుల్లోకి తీసుకుంటామని చెప్పారు. సమావేశం అనంతరం వలంటీర్లకు త్రిమూర్తులు స్వయంగా భోజనాలు వడ్డించారు. కాగా 800 మంది రాజీనామా పత్రాలను వైసీపీ శ్రేణులు స్వీకరించడం గమనార్హం.

కాగా అనుమతి లేకుండా వలంటీర్లతో సమావేశం నిర్వహించారంటూ సీ-విజిల్‌కు అందిన ఫిర్యాదు మేరకు ఎన్నికల అధికారులు ఐదం రాజు, తాతపూడి కనకరాజు సమావేశం జరుగుతున్న హాలు వద్దకు వచ్చి తనిఖీలు నిర్వహించారు. ఇది పార్టీ సమావేశం కాదని, పార్టీ జెండాలు వాడలేదని వైసీపీ పట్టణ అధ్యక్షుడు బావిరాజు అధికారులతో చెప్పారు. తమకు సమావేశానికి అనుమతి ఉందని, ఇది కేవలం వలంటీర్లతో ఆత్మీయ సమావేశం అని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. కాగా సమావేశానికి ఎంతమంది వలంటీర్లు హాజరయ్యారనే దానిపై ఎన్నికల అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా వలంటీర్లతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గ్రూపు ఫొటో తీసుకున్నారు. కాగా సమావేశం విషయమై తనకు ఫోనులో ఫిర్యాదు అందిందని మండపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డీవీవీ ఎల్లారావు చెప్పారు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేయడంతో పాటు కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు. రాజీనామాలు చేయకుండా సమావేశానికి హాజరై ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వలంటీర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



కలెక్టరేట్‌లో మీడియా కో-ఆర్డినేషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఎన్నికల సమగ్ర సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు

మీడియా కో-ఆర్డినేషన్ కేంద్రం

- కలెక్టరేట్‌లో ప్రారంభించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమగ్ర సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు అందించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్, కో-ఆర్డినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర కీలకమని, సమగ్ర సమాచారాన్ని అందించేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రింట్-ఎలక్ట్రానిక్ మీడియాలకు సమాచారాన్ని అందజేసి ప్రజలకు చేరేలా చేయడమే లక్ష్యమన్నారు. ఇందుకోసం అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రసార మాధ్యమాల సహకారం ఎంతో అవసరమన్నారు. మీడియా ప్రతినిధులకు సకాలంలో ఎన్నికల సమాచారాన్ని అందించడంలో సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు సఫలీకృతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గాల మ్యాప్‌లు, ఎన్నికల అధికారుల వివరాలు, పోలింగ్ స్టేషన్ల వివరాలతో కూడిన బోర్డులను కలెక్టర్ తిలకించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూము ద్వారా రూపొందించిన నివేదికల సమాచారాన్ని మీడియా సెంటర్లో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. మే 13న పోలింగ్ జరుగుతుందని, పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత దశలకు సంబంధించి ఎన్నికల సమాచారాన్ని మీడియా సెంటరు ద్వారా ఎప్పటికప్పుడు అందిస్తామన్నారు. అవాస్తవాలకు ప్రాధాన్యమివ్వకుండాకచ్చితమైన సమాచారాన్ని ప్రచురించాలని కోరారు. ప్రింట్-ఎలక్ట్రానిక్ మీడియా ఎన్నికల ప్రకటనలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్‌ను ఎంసీఎంసీ కేంద్రంలో తప్పనిసరిగా పొందాలన్నారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 5 గంటలకు నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల సమాచారాన్ని విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, సహాయ రిటర్నింగ్ అధికారిణి ఎం.ఝాన్సీరాణి, ఎంసీఎంసీ సభ్యులు, సీబీసీ క్షేత్రస్థాయి అధికారి పి.శ్రీరామమూర్తి, మూర్తి, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజరు కె.శ్యామ్‌బాబు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయప్రసాద్, డీపీఆర్వో కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా

విధులు నిర్వర్తించాలి

- ఎన్నికల నిర్వహణ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కడా రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి, ఎన్నికల నిర్వహణ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు కోరారు. ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవోల పాత్ర అత్యంత కీలకమన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారంజిల్లా మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారిగా విధులు నిర్వర్తించడం గొప్ప అవకాశమన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూతప్పులు, పొరపాట్లు జరగకుండా రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలోనే మాక్‌పోల్ నిర్వహించాలన్నారు. పలు అంశాలపై అడిగిన ప్రశ్నలకు సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనీలు కేవీఎస్ఎన్ సుబ్బరాయశర్మ, ఎం.శివప్రసాద్, ఎస్ఎస్ బాలరాజు, ఎన్.శ్రీనివాస్, పోలిశెట్టి, సరిదే సత్యవల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.



రేపటి నుంచి ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 15: పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి కల్యాణోత్సవాలను బుధవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఈవో కృష్ణచైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. బుధవారం తీర్థ మహోత్సవం, స్వామివారి పల్లకి సేవ, రాత్రి 8.45 గంటలకు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం దివ్య కల్యాణం జరుగుతాయి. 18 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, 21న సదస్యం, 22న ప్రత్యేక పూజలు, 23న చక్రస్నానం, 24న పుష్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. స్వయంభూ క్షేత్రమైన జగన్మోహినీ కేశవస్వామి కల్యాణోత్సవాలను తిలకించడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈవో కృష్ణచైతన్య చెప్పారు.



అమలాపురంలో స్లాస్ నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న డీఈవో కమలకుమారి

నేడు జిల్లాలో 157 పాఠశాలల్లో 'స్లాస్' పరీక్ష

అమలాపురం టౌన్, ఏప్రిల్ 15:

జిల్లాలో స్టూడెంట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే (స్లాస్) పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమల కుమారి పిలుపునిచ్చారు. సోమవారం అమలాపురంలోని విద్యానిధి ప్రాంగణంలో సీఆర్ఎంపీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు 'స్లాస్' శ్లాష్ పరీక్ష నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు డీఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాలుగో తరగతి విద్యార్థులకు స్లాస్ పరీక్ష నిర్వహిస్తామని, తద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 157 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు. సమగ్ర శిక్షా సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో వి.రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన అభ్యసన సామర్థ్యాల ఆధారంగా ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు అభ్యసనా సామర్థ్యాల పెంపునకు అవసరమైన పాఠ్య పుస్తకాల రూపకల్పన జరుగుతుందన్నారు. డీసీఈబీ కార్యదర్శి హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష పత్రాలను సరఫరా చేస్తామని, ఓఎంఆర్ విధానంలో పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాలో 3,168 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారని చెప్పారు. ఎంఈవోలు, స్కూలు కాంప్లెక్సు హెచ్ఎంలు, సెక్టోరియల్ అధికారులు పరీక్షను పర్యవేక్షిస్తారు. సదస్సులో ఏపీవో బి.ఆదినారాయణ, నోడల్ సీఆర్పీ వెంకట్, ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి, మెండి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

రూ.1.28 లక్షల నగదు సీజ్

- అక్రమ మద్యం స్వాధీనం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు నిర్వహించిన విస్తృత తనిఖీల్లో భాగంగా మండపేటలో రూ.1,28,831 నగదు సీజ్ చేసినట్టు జిల్లా అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా సోమవారం తెలిపారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్టు చేసి రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 2,499.5 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఆలమూరు పీఎస్ పరిధిలో ఇద్దరిని అరెస్టు చేసి వంద లీటర్ల నాటుసారా, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకుని 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో ఇద్దరిని అరెస్టు చేసి 16 ఎన్‌డీపీ లిక్కర్ బాటిళ్లు, 2.88 లీటర్ల ఐఎంఎల్, 8 డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లు, 1.44 లీటర్ల ఐఎంఎల్ స్వాధీనం చేసుకున్నారు. రామచంద్రపురం, కొత్తపేటల్లో ఎస్ఈబీ అధికారులు 9 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 ఎన్‌డీపీ లిక్కర్ బాటిళ్లు, 1.5 లీటర్ల ఐఎంఎల్, 58 డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లు, 10.44 లీటర్ల ఐఎంఎల్, 100 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఎనిమిది కేసులు నమోదు చేశారు.

ఎస్ఈబీ అధికారులు సార్వత్రిక ఎన్నికల్లో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని ఎస్ఈబీ బ్యూరో ఎస్పీ (మంగళగిరి) ఎస్వీఎస్ మూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్ఈబీ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఇప్పటివరకు ఎస్ఈబీ జరిపిన దాడుల్లో పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, డీఎస్ఈవో కె.రాజ్యలక్ష్మి, అమర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





టెంట్‌లో లబ్ధిదారులు, వైసీపీ నాయకులు (పైన), ఫ్లయింగ్ స్క్వాడ్, అధికారులు రావడంతో టెంట్ తీసేసిన దృశ్యం

అయితే మాకేంటి!

- దేవరపల్లిలో వైసీపీ నాయకుల ఎన్నికల కోడ్ ఉల్లంఘన
- జగనన్న లే-అవుట్ స్థలాలు చూపిస్తామంటూ హల్‌చల్

రావులపాలెం, ఏప్రిల్ 15: ఎన్నికల కోడ్ కారణంగా సెక్షన్ 144 అమలులో ఉన్నందున అనుమతి అనుమతులు లేకుండా ఎక్కడా సభలు, సమావేశాలు నిర్వహించకూడదని అధికారులు చెప్తున్నారు. అయితే వైసీపీ నాయకులు అవేమీ తమకు పట్టవన్నట్టు టెంటు వేసి హల్‌చల్ చేశారు. రావులపాలెం మండలం దేవరపల్లిలో జగనన్న లే-అవుట్‌లో ఊబలంక ప్రాంతవాసులకు గతంలో పట్టాలు మంజూరయ్యాయి. కాగా సోమవారం అక్కడ వైసీపీ నాయకులు లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలు చూపిస్తామని తెలిపారు. లబ్ధిదారుల కోసం టెంట్, టేబుల్స్, వాటర్ టిన్నులు ఏర్పాటు చేశారు. సీఎం జగన్ ఫొటోతో ఉన్న పట్టాలను చేతులో పట్టుకుని లబ్ధిదారులతో కలిసి తిరిగారు. గ్రామానికి చెందిన అక్కడకు చేరుకుని ఇక్కడ ఏం జరుగుతోంది... ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఈ కార్యక్రమం ఏమిటని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న సెక్రటరీ సుభాష్, వీఆర్వో వెంకటేశ్వరరావు సచివాలయ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అనుమతి లేకుండా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. ఇంతలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఎంపీడీవో శ్రీనివాస్ అక్కడకు రావడంతో వైసీపీ నాయకులు టెంటు తీసేసి జారుకున్నారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా... ఈ కార్యక్రమం గురించి తమకు సమాచారం రాగానే సచివాలయ సిబ్బందిని వెంటనే అక్కడికి పంపించామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు తాను కూడా వెళ్లి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించినట్టు చెప్పారు.

నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు చురుగ్గా సన్నాహాలు



ధ్వజస్తంభం తయారీ చేస్తున్న దృశ్యం

అన్నవరం, ఏప్రిల్ 15: రత్నగిరి వాసుడైన సత్యదేవుడి ఆలయ నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే ధ్వజస్తంభ కర్రను అనివేటి మండపం వద్దకు చేర్చగా సోమవారం నుంచి అడుగు భాగంలో రాగిరేకును అమర్చే పనులు చేపట్టారు. 5 అడుగులు మేర భూమి లోపల ఉండే ఈ కర్రకు ముందు రాగిరేకు అమర్చి ధ్వజస్తంభ ప్రతిష్ఠ అనంతరం మిగిలిన సుమారు 60 అడుగులకు రాగిరేకు దానిపై బంగారుపూతను అమర్చనున్నారు. దీనికి సుమారు 4 కోట్లు వ్యయం అవుతుంది. వైదిక కార్యక్రమాల నిర్వహణకు రావిచెట్టు ప్రాంగణంలో యాగాల నిర్వహణకు నూతన పందిరిని నిర్మించారు. 5 రోజుల పాటు జరిగే యాగములు, హోమములు, జపములు, ఇతర వైదికకార్యక్రమాలను ఈ యాగశాలలో నిర్వహిస్తారు. ఈనెల 18న ఉదయం 11 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ తదితర కార్యక్రమాలు అనంతరం తొలిరోజున నూతన ధ్వజస్తంభంకు జలాధివాసం, రెండో రోజున క్షీరాధివాసం, మూడో రోజున పుష్పాధివాసం, నాలుగో రోజున ధాన్యాధివాసంలో ఉంచి 22న ఉదయం కళాన్యాసము, శయ్యాధివాసం హోమ పూర్ణాహుతి అనంతరం ఉదయం 10.48కి ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేపట్టనున్నారు.

నేటి నుంచి నవమి వేడుకలు

అన్నవరం, ఏప్రిల్ 15: సత్యదేవుడి ఆలయ క్షేత్ర పాలకులుగా పూజలందుకుంటున్న రత్నగిరి రామయ్య దివ్య కల్యాణోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 4 గంటలకు రామాలయ ప్రాంగణంలో పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించనున్నారు. 17 ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, అంకురార్పణ, సీతారాములను వెండి ఆంజనేయవాహనంపై గ్రామోత్సవం నిర్వహించి ఉదయం 9.30కి సత్యదేవుడి వార్షిక కల్యాణ వేదికపై శ్రీరామనవమి సీతారాముల దివ్యకల్యాణం నిర్వహిస్తారు. వైశాఖమాసంలో వచ్చే సత్యదేవుడి వార్షిక కల్యాణానికి సీతారాములు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తుండగా చైత్రమాసంలో వచ్చే సీతారాముల దివ్యకల్యాణానికి సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లు పెండ్లిపెద్దలుగా వ్యవహరిస్తారు. 18న ఆస్థానసేవ, 19న పండితసదస్యం, 20, 21 తేదీలలో నిత్యార్చనలు, ఆస్థానసేవ, 22న వనవిహారం, 23న చక్రస్నానం, 24న శ్రీపుష్పయోగంతో వేడుకలు ముగుస్తాయి. ఈ సందర్భంగా రామాలయానికి రంగులు వేసి విద్యుద్దీప అలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

తక్కువ బరువుతో పుట్టిన కవలలకు పునర్జన్మ

జీజీహెచ్ వైద్యుల కృషితో సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి



వివరాలు వెల్లడిస్తున్న వైద్య బృందం

జీజీహెచ్(కాకినాడ), ఏప్రిల్ 15: ఒకే కాన్పులో ముగ్గురు చొప్పున జన్మించి అతి తక్కువ బరువుతో ప్రాణాపాయంలో ఉన్న ఆరుగురు చంటి బిడ్డలకు కాకినాడ జీజీహెచ్ వైద్య బృందం ప్రత్యేక చికిత్సను అందజేసి పునర్జన్మను ప్రసాదించింది. పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయి ఇళ్లకు వెళుతున్న చిన్నారులకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన సంధ్య, లక్ష్మీ వరప్రసాద్ దంపతులకు రెండో కాన్పులో ఈ ఏడాది ఫిబ్రవరి 1న నెలలు నిండకుండానే 8వ నెలలో ఒక ఆడ పిల్లకు, ఇద్దరు మగ పిల్లలకు మొత్తం ముగ్గురికి జన్మనిచ్చింది. ఆడ పిల్ల 1500 గ్రాముల బరువు, ఒక మగ శిశువు 1000 గ్రాముల బరువు, మరో మగ శిశువు 620 గ్రాముల బరువుతో జన్మించారు. శిశువు తల్లి గర్భంలో పూర్తిగా ఎదగకపోవడంతో అవయవాలు ఎదుగుదల కూడా జరగలేదు. దీంతో పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ డి.మాణిక్యాంబ ఆధ్వర్యంలో 620 గ్రాముల బరువు ఉన్న శిశువును నవ జాత శిశు సంరక్షణ కేంద్రం(ఎన్ఐసీయు)కు తరలించి చిన్నపిల్లల వైద్యులు 72 రోజులు నిరంతరప్రాయంగా శ్రమించి ప్రత్యేక వైద్య చికిత్సను అందజేశారు. దీంతో ప్రస్తుతం ఆ మగ శిశువు 1700 గ్రాముల బరువు పెరిగి పూర్తిగా కోలుకున్నాడు. ఆడ శిశువు 2.5 కిలోలు, 1000 గ్రాముల బరువుతో పుట్టిన మరో మగ శిశువు 2.2 కిలోల బరువుతో పూర్తిగా కోలుకున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. అలాగే పెద్దాపురానికి చెందిన సత్యప్రియాంక, సతీష్ దంపతులు గతనెల 13న ఒకే కాన్పులో ముగ్గురు కవలలు జీజీహెచ్‌లో జన్మించారు. వారు కూడా బరువు 1000, 1500 గ్రాముల మధ్య తక్కువ బరువు కలిగి ఉండి ప్రాణాపాయంలో ఉండడంతో పిడియాట్రిక్స్ వైద్య నిపుణులు 32 రోజుల పాటు శ్రమించి ప్రత్యేక వైద్య చికిత్సను అందజేయడంతో శిశువులు ముగ్గురు పూర్తి ఆరోగ్యదాయకంగా ఉన్నట్లు డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. గొల్లప్రోలు మండలం కొడవలికి చెందిన జె.నాగమణి గత నెల 8న 1500 గ్రాములు, 910 గ్రాములు కవలలకు జన్మనిచ్చింది. కోరుకొండకు చెందిన దుర్గాభవాని 1500 గ్రాములు, 1000 గ్రాములు శిశువులకు జన్మనిచ్చారు. ఆ శిశువులను కూడా నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఉంచి 36 రోజులు పాటు ప్రత్యేక వైద్య బృందం కంటికి రెప్పలా కాపాడి పునర్జన్మను అందించారు. ఈ ప్రత్యేక వైద్యచికిత్సకు బయట ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.లక్షల్లో ఖర్చవుతుందని, రాష్ట్రంలోని 11 బోధనాస్పత్రుల్లో కంటే కాకినాడ జీజీహెచ్ పిడియాట్రిక్ విభాగ వైద్య సేవలు ప్రత్యేకతను సంతరించుకున్నాయన్నారు. ప్రాణాపాయంలో ఉన్న చంటి బిడ్డలకు పూర్తిగా కోలుకునేలా వైద్య చికిత్సను అందజేసిన ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్.మాధవి, డాక్టర్ డీఎల్ విద్య, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ బుర్రి రాంబాబు, డాక్టర్ వి.విజయభాస్కర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ గణపతి సూర్యనారాయణ, నియోనటాలజీ వైద్య నిపుణులు డాక్టర్ కీర్తి, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ గౌతమిలను సూపరింటెండెంట్ అభినందించారు. జీజీహెచ్, చిన్న పిల్లల విభాగంలో నిష్ణాతులైన వైద్య నిపుణులు ఉన్నారని, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ప్రజలు ఇక్కడ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కోరారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పుష్కరరావ్, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ కోనాల అనిత, ఆర్ఎంవో డాక్టర్ యమున పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.90.90 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం, ఏప్రిల్ 15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను దేవదాయ, ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం తెరిచి లెక్కించారు. 26 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.70,39,801, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.20,51,049.. మొత్తం రూ.90,90,850 ఆదాయం లభించింది. బంగారం 22 గ్రాములు, వెండి 700 గ్రాములు, పలు దేశాల కరెన్సీ లభించాయి. క్షేత్రపాలకుడు విశ్వేశ్వర హుండీ ఆదాయం రూ.2,33,164 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతి రాజు కిషోర్‌కుమార్ తెలిపారు. లెక్కింపులో కెనరా బ్యాంకు సిబ్బంది, పోలీసులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భద్రాచలం రాముడికి కల్యాణ బొండాల సమర్పణ

మండపేట, ఏప్రిల్ 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన కాజులూరి వెంకటరామారెడ్డి గత 24 ఏళ్ల నుంచి భద్రాచలం రాములవారి శ్రీరామనవమి వేడుకల కోసం కల్యాణ బొండాలు తయారీ చేసి అందిస్తున్నారు. ఆయన 2000 సంవత్సరం నుంచి క్రమం తప్పకుండా స్వామివారికి బొండాలు అందిస్తున్నారు. ఉగాది రోజున బొండాలు తయారు చేయడం ప్రారంభించి పదిరోజులు వ్యవధిలోనే తయారీ పూర్తి చేశారు. మంగళవారం ఉదయం మండపేట నుంచి బొండాలను భద్రాచలానికి తరలిస్తున్నట్లు రామారెడ్డి తెలిపారు. అలాగే ఈనెల 22న కల్యాణం జరిగే ఒంటిమిట్ట రామాలయానికి కూడా బొండాలు పంపుతున్నానని రామారెడ్డి చెప్పారు. గొల్లలమామిడాడ లాంటి పలు ప్రసిద్ధి ఆలయాలకు కూడా బొండాలను పంపిస్తానని చెప్పారు.



నేడు రావులపాడు శివారులో సీఎం జగన్ బస



ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

రావులపాలెం, ఏప్రిల్ 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు శివారు మల్లయ్యదొడ్డి సెంటరు సమీపంలోని ఒక ప్రైవేటు లే-అవుట్‌లో సీఎం జగన్ మంగళవారం రాత్రి బస చేస్తారని వైసీపీ వర్గాలు తెలిపాయి. మంగళవారం రాత్రి 10.30కు జగన్ బస చేసే ప్రాంతానికి చేరుకుంటారు. 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కోనసీమ జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశం నిర్వహిస్తారు. 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి రావులపాలెం కళా వెంకట్రావు సెంటరు మీదుగా జాతీయ రహదారిపై ఆలమూరు మండలం మడికి వరకు సుమారు మూడు గంటల పాటు బస్సు యాత్ర జరుగుతుంది.

ఫ్లోర్‌ప్రైడ్ ట్యాంకు సిలిండర్ నుంచి గ్యాస్‌లీక్

పరిశీలిస్తున్న పోలీసులు





జగ్గంపేట, ఏప్రిల్15: నీటిని శుద్ధి చేసేందుకు ఉపయోగించే ఫ్లోర్‌ప్రైడ్ ట్యాంకు సిలిండర్ నుంచి ప్రమాదకర గ్యాస్ లీకైంది. విషయం ఆలస్యంగా తెలిసినప్పటికీ జగ్గంపేట అగ్నిమాపక సిబ్బంది వెంటనే గ్యాస్ లీకేజీని అరికట్టడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం నరేంద్రపట్నం పంచాయతీ పరిధిలోని బావారం గ్రామంలో రక్షిత మంచినీటి ప్రాజెక్టులో ఈ ఘటన సోమవారం జరిగింది. జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో 36 గ్రామాలకు రక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సుమారు రూ.24 కోట్లతో బావారం రక్షిత మంచినీటి పథకం ప్రారంభించారు. ఏలేరు జలాలు శుద్ధి చేసి తాగునీటిని సరఫరా చేసేవారు. అయితే ఇటీవల కాలం ఈ ప్రాజెక్టు అధికార వైసీపీకి చెందిన ప్రయివేట్ కాంట్రాక్టర్ల చేతిలోకి వెళ్లింది. ఇక అప్పటి నుంచి దీని నిర్వాహణ పూర్తిగా గాడి తప్పింది. ప్లాంట్లో శుభ్రత లేకుండా పోయింది. అసలు ప్లాంట్లో ఏం జరుగుతుందో కూడా బయటకు తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం గ్యాస్ లీకేజీ ఘటనకు బయటకు పొక్కకుండా చూసేందుకు కాంట్రాక్టర్లు నానా ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ తహసీల్దార్, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందడంతో ఫైర్ ఆఫీసర్ లక్ష్మణరావు తన సిబ్బందితో వచ్చి గ్యాస్‌లీకేజీని అదుపుచేసి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ ఇంతియాజ్‌బాషా సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. అయితే ఈఫ్లోర్‌ప్రైడ్ ట్యాంకును ఎప్పటికప్పుడు పరిశీలించడానికి ప్రత్యేకంగా సూపర్‌వైజర్ ఉండాలి కాని ఇక్కడ అలాంటి పరిస్థితి లేదు. దీంతో ఉద్యోగులు కూడా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. అసలే గ్రామానికి అతి దగ్గరగా ఉన్న ఈ ప్లాంట్ వల్ల తమ గ్రామానికి ఏం ముప్పు వాటిల్లుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని ప్లాంట్ నిర్వాహణపై తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

ఒకరికి అస్వస్థత

జగ్గంపేట మండలం బావారం రక్షిత మంచినీటి పథకం గ్యాస్ లీకేజీ ఘటనలో ఒకరు అస్వస్థతకు లోనయ్యారు. వాటర్‌ప్లాంట్ పైపులైన్ వద్ద క్లోరిన్ గ్యాస్ సిలెండర్ వాల్వు లీకవడంతో అగ్నిమాపక సిబ్బంది సిలిండర్‌ను వాటర్ కూలింగ్ చేసి వాల్వు కట్టేయడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈఘటనలో గ్యాస్ పీల్చిన ఆపరేటర్ కంచి నాగేశ్వరరావు అస్వస్థతకు లోనవడంతో జగ్గంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన అనంతరం ప్రస్తుతం కోలుకున్నట్లు తెలియజేశారు.

తనను దూరం పెడుతున్నాడని.. వ్యక్తి మర్మాంగాన్ని కోసేసిన యువతి

అల్లవరం, ఏప్రిల్ 15: తనను దూరం పెడుతున్నాడనే కోపంతో ఓ యువతి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న వ్యక్తి మర్మాంగాన్ని సగం కోసేసింది. ఈ సంఘటన తీవ్ర సంచలనం రేపింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం సామంతకుర్రు పంచాయతీ ఎస్.రామేశ్వరం తీర గ్రామంలో ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెళ్లికాని యువతికి, వివాహం అయిన చెక్క చినసత్తిబాబు అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. ఈ మధ్య కాలంలో తనతో దూరంగా ఉండడమే కాక ఫోను చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో యువతి కక్ష పెంచుకుని ఆదివారం రాత్రి ఇంటికి రప్పించుకుని నిద్రపోతున్న సమయంలో సత్తిబాబు మర్మాంగాన్ని కోసేసింది. తీవ్ర రక్తస్రావం కాగా బాధితుడిని హుటాహుటిన అమలాపురం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. యువతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ విజయ



సిబ్బందికి సూచనలిస్తున్న విజయ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, సారా తయారీ, రవాణా, విక్రయాలపై మరింత అప్రమత్తంగా ఉన్నామని స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ స్పష్టం చేశారు. సోమవారం ఆమె స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ-సెబ్) రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్‌ను పరిశీలించారు. సెబ్ జిల్లా అధికారి పి.సోమశేఖర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందికి అసిస్టెంట్ కమిషనర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో పంపిణీ చేయడానికి మద్యం, సారా నిల్వ చేయడం, మాదకద్రవ్యాలు తదితర వాటిపై పటిష్టమైన నిఘాతో సమాచారం సేకరించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెబ్ కమిషనర్ ఎం.రవిప్రకాశ్ ఆదేశాలను కచ్చితంగా పాటించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను అనుసరించాలని సూచించారు. గోదాములు తదితర ప్రాంతాల్లోని పెద్ద మొత్తంలో మద్యం నిల్వలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. కాలిటీ, క్వాంటిటీ కేసులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అక్రమ మద్యం, సారా, మాదకద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా సెబ్ పోలీస్‌స్టేషన్‌కు ప్రజలు సమాచారం అందించాలని సెబ్ జిల్లా అధికారి సోమశేఖర్ సూచించారు. అవసరమైతే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అక్రమ మద్యం, సారా, మాదక ద్రవ్యాల నిల్వ, రవాణా, విక్రయాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సెబ్ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డా.ఎన్.నిక్సన్, ఎస్ఐ ఎం ఎస్ఎస్ శాస్త్రి, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామేశంపేట చెక్‌పోస్టు తనిఖీ

రంగంపేట, ఏప్రిల్ 15: రంగంపేట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో రామేశంపేట వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును స్టేట్ టాస్క్ ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ తనిఖీ చేశారు. ఎన్నికలు కోడ్ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు చెక్‌పోస్టల పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. మద్యం, నగదు, ఇతర బహుమతులు రవాణా జరగకుండా చూడాలని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఈబీ రంగంపేట సీఐ ఎస్.రాంబాబు, పెద్దాపురం సీఐ ఏయూబీ సుబ్రహ్మణ్యం, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ టి.గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ అమ్మాయే పుట్టిందని..

మగబిడ్డపై మమకారంతో నాలుగో సారి గర్భవతి అయిన మహిళ

భర్తకు సైతం తెలియని వైనం

అబ్బాయి పుడితే చెబుతామని..అమ్మాయి పుడితే వదిలించుకుందామనుకున్న మహిళ

అమ్మాయే పుట్టడంతో తుప్పల్లోకి..

గుర్తించిన స్థానికులు. బయటపడిన నిజం



తుప్పల్లో పడేసిన పాప

కడియం, ఏప్రిల్ 15: మగ సంతానంపై మమకారం పెంచుకున్న తల్లి మానవత్వం మరిచి అప్పుడే పుట్టిన పసికందును 20 అడుగుల ఎత్తులో నుంచి తుప్పల్లోకి విసిరేసింది. తర్వాత తన తప్పు తెలుసుకుని కన్నీరుపెట్టింది. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో జరిగింది. స్థానికులు, బంధువులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వేమగిరి గణపతినగర్‌కు చెందిన తాపీ పనిచేసే వ్యక్తికి ముగ్గురు ఆడపిల్లలు.. వారు ప్రస్తుతం స్కూలుకు వెళుతున్నారు. అయితే సదరు వ్యక్తి భార్యకు మగసంతానంపై మమకారంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నట్టు నమ్మించి గర్భం దాల్చింది. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచింది. అబ్బాయి పుడితే అందరికి చెబుదాం.. అమ్మాయి పుడితే మాయం చేద్దాం అనే ఉద్దేశంతో ఉంది. బంధుమిత్రులకు, పరిసర ప్రజలకు విషయం తెలియకుండా దాచింది. భర్తకు కూడా అనుమానం రాకుండా చేసింది. పొట్ట పెరుగుతుందని భర్త అనడంతో ఈ మధ్య తినడంతో పెరుగుతుందని నమ్మించింది. స్థానిక వైద్య సిబ్బందికి, అంగన్‌వాడీలకు తాను గర్భిణీ అనే విషయం ఇవ్వక పోగా అందుకు సంబంధించి వైద్యసేవలు పొందలేదు. ఆదివారం పురుటినొప్పులు వచ్చాయి. అది గమనించి తన భర్తను, పిల్లలను చర్చికి పంపింది. తనకు తానే పురుడు పోసుకుంది. అందుబాటులో ఉన్న కత్తిపీటతో పేగును కత్తిరించింది. అమ్మాయి పుట్టిందని గమనించిన వెంటనే ముందుగా అనుకున్న పథకం ప్రకారం నైటీలో పసికందును చుట్టి 20 అడుగుల ఎత్తు నుంచి తుప్పల్లోకి విసిరేసింది. అక్కడ చెత్తాచెదారం, పందులు ఉన్నాయి. అక్కడి నుంచి వెళ్లి స్నానం చేసి ఎవ్వరికీ తెలియనివ్వకుండా దాచింది. అయితే తుప్పలు నుంచి ఏడుపులు వినిపించడంతో చుట్టుప్రక్కల వారు వెళ్లి చూడగా ముద్దులొలికే ఆడశిశువు కనిపించింది. కాలికి చిన్న రాపిడి గాయం తప్ప క్షేమంగా ఉంది. పసికందు ఎవరనేది అందరిలో చర్చ మొదలైంది. బయట నుంచి అక్కడ ఎవరూ పసికందు పాడేసే అవకాశం లేనందున అక్కడి వారి పిల్లే అయి ఉంటుందని ఆరా తీశారు. ఇంతలో అందరితో పాటు భర్త వచ్చి చూస్తే పసికందుకు చుట్టి ఉన్న నైటీ కనిపించింది.. ఆ నైటీ తన భార్యదని గుర్తించాడు. ఆ నైటీ ఆధారంగా ఇంటికెళ్లి భార్యను నిలదీశాడు. దీంతో జరిగిన విషయం చెప్పింది. ఆపై ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. మగ సంతానంపై మమకారంతో ఇలా చేశానని గగ్గోలు పెట్టింది. తల్లీబిడ్డను కడియం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారని బంధువులు, వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఏలేశ్వరం, ఏప్రిల్ 15: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని యర్రవరం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మహిళ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలేశ్వరం దిబ్బలపాలెంకు చెందిన పొన్నగంటి రామకృష్ణ కుమార్తె లోవదుర్గకు భీమవరానికి చెందిన ఎలుబోలు సురేష్ తో సుమారు 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఏలేశ్వరం నుంచి వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం ఆటోలో వెళ్తుండగా యర్రవరం చెక్‌పోస్టు వద్దకు వెళ్లే సరికి ఆటోలో వెళ్తున్న లోవదుర్గకు వాంతులు అవ్వడంతో తమ తల బయటపెట్టి వాంతులు చేసుకొంటుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం లోవదుర్గ (29) తలను ఢీకొనడంతో తలకు బలంగా తగలడంతో రక్తం కారుతుండగా ఆటోలో ఉన్న వాళ్లు ఆటో డ్రైవర్ సాయంతో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. ఏలేశ్వరం ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేశారు.

హోటళ్లు, బిర్యానీ పాయింట్లపై అధికారుల దాడులు

పిఠాపురం, ఏప్రిల్ 15: పిఠాపురం పట్టణంలోని హోటళ్లు, బిర్యానీ పాయింట్లలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లైస్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న డొమెస్టిక్(గృహ అవసరాల) సిలిండర్లును స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని స్టువర్టుపేటలో గల హరివిల్లు ఫుడ్స్‌ను తనిఖీ చేయగా ఏడు డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. హరివిల్లు ఫుడ్స్ యజమాని రావుల శేషుకుమార్‌పై నిత్యావసర వస్తువుల చట్టం 6ఏ, ఎల్‌పీజీ చట్టం 2000 కింద కేసు నమోదు చేసి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలోని బిరియాని పాయింట్‌లో తనిఖీలు చేసి అయిదు డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని యజమాని పిల్లా శ్రీనివాస్‌పై 6ఏ కింద కేసు నమోదు చేశారు. గృహ సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎస్పీ హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారి జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ, సీఎస్‌డీటీ ఇస్మాయిల్, జీవానందం, లోవరాజు పాల్గొన్నారు.



అంతర్వేది ఆలయ రాజగోపురంపై కలశాల స్థాపన

అంతర్వేది, ఏప్రిల్ 15: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఉత్తర రాజగోపుర కలశాల పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం కలశల పునఃప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఆలయ అధికారులు కలశలతో ఆలయ ప్రదక్షిణ అనంతరం క్రేన్ సాయంతో ఉత్తర రాజగోపురంపై కలశలను అర్చకులు ప్రతిష్ఠించారు. అనంతరం 11 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమార రామగోపాలరాజాబహదూర్, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

లోవలో పంచలోహ విగ్రహాల పునఃప్రతిష్ఠ



తుని రూరల్, ఏప్రిల్15: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయంలో తలుపులమ్మ అమ్మవారి పంచలోహ విగ్రహాల పునఃప్రతిష్ఠ సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బ్రహ్మశ్రీ ఇమని నాగ వెంకట కృష్ణ, ఐజమూరి రామంతో పాటుగా ఇతర పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి పంచలోహ విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి లోవ దేవస్థానం పరిసర గ్రామాల భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కార్యనిర్వహణాధికారి, ఉప కమిషనర్ పెన్మచ్ఛ విశ్వనాథ రాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సరుకుతో పాటు వ్యాన్ దగ్ధం



మండపేట, ఏప్రిల్ 15: మండపేట మండలం ఇప్పనపాడు వద్ద రోడ్డుపై విద్యుత్‌లైన్లను తాకడంతో తాపేశ్వరం నుంచి పరుపులు తయారీ కోసం వినియోగించే పోమ్ ముడి సరుకును తీసుకువెళ్తున్న వ్యాన్ సరుకుతో సహా కాలిబూడిదైంది. ద్వారపూడి వైపు వెళ్తున్న లోడ్ వ్యాను ఇప్పనపాడు వద్ద ఉన్న రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి ప్రమాదం జరిగింది. విషయాన్ని గమనించిన డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి వ్యాన్‌ను రోడ్డు మీద నుంచి ఊరు బయట ఖాళీ ప్రదేశానికి తరలించే ప్రయత్నం చేశాడు. కానీ చివరకు మంటలు వ్యాపించటంతో ఇప్పనపాడు శివారు రిలయన్ కాలనీ వద్ద వదిలేసి డ్రైవర్ బయట పడ్డారు. అనపర్తి, మండపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ముడిసరుకు, వ్యాన్ విలువ సుమారు రూ.23 లక్షలు మేర ఉంటుందని అధికారులు శ్రీనివాసరెడ్డి, హనుమంతరావు తెలిపారు.

నేడు రావులమ్మ అమ్మవారి తీర్థం

అంబాజీపేట, ఏప్రిల్ 15: గంగలకుర్రు గ్రామదేవత శ్రీరావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రాత్రి జరిగిన జాతరలో గరగనృత్యాలు, కోయిడ్యాన్సులు, తీన్‌మార్‌డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి తీర్థమహోత్సవాల్లో భాగంగాపది రోజుల నుంచి వివిధ సామాజిక వర్గాల వారు అమ్మవారి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

రేపు విద్యానిధిలో జిల్లాస్థాయి చెస్ పోటీలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 15: అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల్లో బుధవారం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-17 జిల్లా స్థాయి బాలురు, బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. ఈ నెల20 నుంచి విజయవాడలో జరిగే అండర్-17 రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా నుంచి అర్హులైన వారిని ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు 2007 జనవరి 1తర్వాత జన్మించి ఉండాలన్నారు. ప్రవేశ రుసుం రూ.300 చెల్లించాలని, ఇతర వివరాలకు 98491 75179నెంబరును సంప్రదించాలని కోరారు.

కూటమి ప్రభుత్వంతోనే ఆర్థిక పురోభివృద్ధి



టీడీపీలో చేరిన మాజీ ఎంపీటీసీ, తదితరులు

కొత్తపేట, ఏప్రిల్ 15: అన్నివర్గాలు అభివృద్ధి చెంది ఆర్థిక పురోగతి సాధించాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం ఆయన స్వగ్రామం వాడపాలెంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ రద్దు చేసిన దళిత పథకాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, అసెంబ్లీ అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

బిళ్లకుర్రుకు చెందిన మాజీఎంపీటీసీ నూకపెయ్యి సుశీల రాణి కుటుంబ సభ్యులతో పాటు స్థానిక అంబేద్కర్ వెల్ఫేర్ ఎస్సీ సొసైటీ సభ్యులు ముల్ల సురేష్‌కుమార్, బీర జగపతి, నల్లా శ్రీనుతో పాటు మండలానికి చెందిన సచివాలయ వలంటీర్ యేమన సతీష్‌లు టీడీపీలో చేరారు. వీరికి కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తాడి శ్రీనివాసరెడ్డి, వి.కృష్ణ, మల్లిడి సూర్యనారాయణరెడ్డితో పాటు కొత్తపేట, బిళ్లకుర్రు గ్రామనాయకులు పాల్గొన్నారు.

నమశ్శివాయకు మద్దతుగా ప్రచారం



యానాం, ఏప్రిల్ 15: పుదుచ్చేరి లోక్‌సభ ఎన్‌డీఏ అభ్యర్థి ఏ.నమశ్శివాయకు మద్దతుగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, మున్సిల్ మాజీ ఛైర్మన్ గిడ్ల చంద్రరావు, వైస్ ఛైర్మన్ పెండెం సూర్యప్రకాష్, రిటైర్డ్ సీఐ గూటం శివగణేష్, బడుగు బలరాం ఆయా వార్డుల్లో, గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మల్లాడి బలపరుస్తున్న అభ్యర్థి నమశ్శివాయను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. నమశ్శివాయకు మద్దతుగా బీజేపీ యానాం శాఖ అధ్యక్షుడు కనకాల రాజు ఆధ్వర్యంలో మెట్టకుర్రు వార్డు పరిధిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నమశ్శివాయకు యానాం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.పుదుచ్చేరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వి.వైద్యలింగానికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్లాడి సత్తిబాబు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాది దినేష్ నేతృత్వంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. యానాం నియోజవర్గంలో వివిధ ప్రాంతాలకు వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. పుదుచ్చేరి నుంచి వచ్చిన కాంగ్రెస్ ప్రతినిధి పెద్దసాయి పెరుమాళ్, రాందాసు ప్రచారంలో పాల్గొన్నారు.

అమలాపురం పార్లమెంట్‌ను అగ్రస్థానంలో నిలుపుతా







అయినవిల్లి: ఎంపీ అభ్యర్థి హరీష్‌ను కలుసుకున్న కాపుసంఘ నాయకులు, ద్రాక్షారామ: ఎన్నికల కార్యాలయం ప్రారంభోత్సవంలో సర్వమత ప్రార్థనలు, అమలాపురం:బీసీ సదస్సులో మాట్లాడుతున్న అయితాబత్తుల ఆనందరావు

పార్లమెంటరీ కూటమి అభ్యర్థి హరీష్‌మాధుర్

అయినవిల్లి, ఏప్రిల్ 15: అమలాపురం పార్లమెంటు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతానని అమలాపురం పార్లమెంటరీ కూటమి అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ అన్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో ప్రజాసమస్యలు పరిష్కరిస్తానని పి.గన్నవరం కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం పోతుకుర్రు, క్రాప, శంకరాయగూడెం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల్లో పార్లమెంటుకు సైకిల్ గుర్తుపై, అసెంబ్లీకి గాజు గ్లాసుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చిట్టూరి శ్రీనివాస్, మద్దాల సుబ్బారాజు, మట్టపర్తి రాజేశ్వరరావు, దంగేటి వెంకటరమణ, కుడుపూడి బుజ్జి, వస్కా శ్యామ్, వారా లక్ష్మీనరసింహరామ్, గుమ్మడి వెంకటేశ్వరరావు, డొక్కా నాథ్‌బాబు, నామన రాంబాబు, బొబ్బిలి రాంబాబు పాల్గొన్నారు. కె.జగన్నాథపురంలో కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ప్రచారం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ గంగుమళ్ల కాశీ అన్నపూర్ణ-శ్రీనివాస్ దంపతులతో కలసి నిర్వహించిన ప్రచారంలో ఎంపీ అభ్యర్థి హరీష్‌కు సైకిల్ గుర్తుపైనా, తనకు గాజుగ్లాసు గుర్తుపైనా ఓట్లువేసి గెలిపించాలని అభ్యర్థించారు. గనిశెట్టి వెంకటేశ్వరరావు, బొక్కా రామచంద్రరావు, గంటి సత్తిబాబు, కారుపర్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యం

కూటమి అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా కాపులంతా సంఘటితంగా పనిచేస్తారని కాపుసంఘ నాయకులు ఆకుల రామకృష్ణ, నల్లా పవన్‌కుమార్, గంధం పల్లంరాజు పేర్కొన్నారు. మండలంలో ప్రచారంలోఉన్న కూటమిఎంపీ అభ్యర్థి హరీష్‌మాధుర్‌ను సోమవారం వారు కలిశారు.

అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం

అంతర్వేది, ఏప్రిల్15: మోరి,అంతర్వేది దేవస్థానం, అంతర్వేది పల్లిపాలెం, టేకిశెట్టిపాలెం గ్రామాల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ నాయకులతో కలిసి సోమవారం ప్రచారం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు, తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌కి సైకిల్ గుర్తుపై, అసెంబ్లీ అభ్యర్థి దేవ వరప్రసాద్‌కు గాజుగ్లాసుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, పట్టాపు సూర్యప్రకాశరావు, తిరుమాని ఆచార్యులు, పప్పుల రమేష్, గెడ్డం సింహ, కొల్లి మహలక్ష్మి, పినిశెట్టి బుజ్జి, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, ఉండపల్లి అంజి, శంకరగుప్తం కొండబాబు, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి

ద్రాక్షారామ, ఏప్రిల్15: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం ద్రాక్షారామలోని మెయిన్‌రోడ్డు, సూర్యవీధి, చంద్రవీధుల్లో ఎన్నికల ప్రచారం జరిపారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తొలుతద్రాక్షారామలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల కార్యాలయాన్ని సుభాష్ ప్రారంభించారు. సుభాష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీ కన్వీనర్ దూడల శంకరనారాయణతో కలిసి పూజలు నిర్వహించారు. సర్వమత ప్రార్థనలు జరిపారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కొమరిన వీర్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జి పెంకె సాంబశివరావు, టీడీపీనాయకులు రేవు శ్రీను, పేకేరు బాబ్జి, జనసేన నాయకులు నామా వెంకన్నబాబు, సంపతి సత్యనారాయణ, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు నెలకు రూ.4వేలు పెన్షన్

అమలాపురంరూరల్, ఏప్రిల్15: రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి రాగానే 50ఏళ్లు నిండిన బీసీలకు నెలకు రూ.4వేలు చొప్పున పెన్షన్ అందిస్తామని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. టీడీపీరాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి అధ్యక్షతన పేరూరులో సోమవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. నాయకులు పెచ్చెట్టి విజయలక్ష్మి, బొర్రా ఈశ్వరరావు, మంద గెద్దయ్య, చొల్లంగి సత్యసాయిబాబా, భాస్కర్ల రామకృష్ణ, మాడా మాధవి, యనమదల లక్ష్మి, మొయిల శివ, దేవరపల్లి వీరేశ్‌కుమార్, చింతపల్లి వెంకన్న, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్ర భవిష్యత్తు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 15: కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మంథా ఫణికుమార్ ఆధ్వర్యంలో తోట్లపాలెం తదితర ప్రాంతాల్లో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పెచ్చెట్టి విజయలక్ష్మి, చొల్లంగి సత్యసాయిబాబా, అధికారి జయవెంకటలక్ష్మి, నూదా చిన్నా, ఆకుల బుజ్జి, కంచిపల్లి అబ్బులు, నల్లా శ్రీధర్, లింగోలు పండు, మొయిల శివ, బొర్రా ఈశ్వరరావు, మాడా మాధవి, పిచ్చిక శ్యామ్, చింతపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

యోగా ఉచిత శిక్షణా కేంద్రం ప్రారంభం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 15: పట్టణంలోని భూపయ్య అగ్రహారంలో దువ్వూరి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మమ్మ యోగా ఉచిత శిక్షణా కేంద్రాన్ని వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, డాక్టర్ కొత్తూరి శ్రీమన్నారాయణ సోమవారం ప్రారంభించారు. వలవల వెంకటరెడ్డినాయుడు, డాక్టర్ అనంతలక్ష్మి, పుత్సా కృష్ణకామేశ్వర్, యర్రమిల్లి అనంతలక్ష్మి, పేరి లలిత, పుత్సా రాజేశ్వరి, సప్పా పద్మ, కారుపర్తి నళిని పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యం

కాపు జేఏసీ నేతలు



కాపు కల్యాణ మండపంలో జిల్లా ముఖ్య కాపునేతల సమావేశం

అమలాపురంటౌన్, ఏప్రిల్15: కాపులను ఈబీసీలో చేర్చేందుకు సిద్ధపడడమే కాకుండా కాపుకార్పొరేషన్ ఏర్పాటుచేసి ఎందరో పేద వర్గాల వారికి అండగా నిలిచిన టీడీపీతో పాటు మద్దతు ఇచ్చిన ఎన్డీయే కూటమికి కాపులంతా అండగా నిలవాలని కాపు జేఏసీ నాయకులు ఆరేటి ప్రకాష్, సలాది రామకృష్ణ అన్నారు. గండు వీధిలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు అధ్యక్షతన జిల్లాలోని కాపు జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఎన్డీయే కూటమితోనే కాపులకు న్యాయం జరుగుతుందని వక్తలు పేర్కొన్నారు. ఎన్డీయే కూటమి అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నాయకులు నల్లా పవన్‌కుమార్, అల్లాడ స్వామినాయుడు, చిక్కాల గణేష్, యేడిద శ్రీను, లింగోలు పండు, నల్లా స్వామి, తిక్కిరెడ్డి నేతాజీ, నల్లా మల్లిబాబు, నల్లా అజయ్, దున్నాల దుర్గ పాల్గొన్నారు.

గరికిపాటి కుటుంబానికి ఆర్ఎస్ పరామర్శ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్15: టీడీపీ సీనియర్ నేత గరికిపాటి సూర్యనారాయణమూర్తి కుటుంబాన్ని సోమవారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం పరామర్శించారు. మూర్తి సోదరుడి కుమారుడు జానకిరామయ్య ఇటీవల మృతిచెందారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, పంపన శ్రీనివాస్, కొననా శ్రీనివాసరావు, గుణ్ణం వినోద్, ఎలుగుబంటి లక్ష్మణ్, ఈదల దొరబాబు పరామర్శించారు.

అంబేడ్కర్ కలలు నిజం చేసేందుకు కృషి చేయాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 15: అంబేడ్కర్ కలలు గన్న ప్రబుద్ధ భారత్‌ను సాకారం చేయడంలో బౌద్ధ ఉపాసకులు, బౌద్ధ అనునాయులు సమష్టిగా కృషి చేయాలని బీఎస్ఐ జాతీయ నాయకులు ఎస్ఆర్ భూపతి పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో సోమవారం మట్టా వెంకట్రావు అధ్యక్షతన జరిగిన బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా సర్వసభ్య సమావేశంలో భూపతి మాట్లాడారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గౌతమబుద్ధుని చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించి పంచశీల పఠించారు. అనంతరం జిల్లా కార్యవర్గంలో ఏర్పడిన ఖాళీల భర్తీకి ఎన్నికలు నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన వారిని పలువురు అభినందించారు. ఎన్నికల నిర్వహణను భూపతి, వెంకట్రావులు వ్యవహరించారు. కార్యక్రమంలో చీకురుమెల్లి చిరంజీవి, కాశి వెంకటరమణ, జేవీవీ సత్యనారాయణ, పెనుమాల చిట్టిబాబు, దడాల రామకృష్ణ, కేవీవీ సత్యనారాయణ, బుడితి రాజేంద్రప్రసాద్, పులపకూర గంగేయుడు, మాగాపు ఈశ్వరరావు, గిడ్ల రమేష్, కొమ్మాబత్తుల రఘు, నందిగ ధనరాజు, కె.రమణ పాల్గొన్నారు.



సమావేశమైన బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నాయకులు

వైసీపీ నుంచి భారీగా జనసేనలో చేరికలు



అంతర్వేది, ఏప్రిల్ 15: వైసీపీ పాలనలో పడిన కష్టాలు, జీవనాధారం లేక వలసలు వెళ్లిపోయే పరిస్థితులు రావడం ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి లేని రాష్ట్రంగా తయారు చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదని, ఆ ప్రభుత్వాన్ని గద్దె దింపే బాధ్యత ప్రజలు 2024లో బాధ్యత తీసుకున్నారని రాజోలు కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ అన్నారు. నిరంతరం రాష్ట్ర, దేశ ప్రయోజనాల కోసం శ్రమించే పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి అంతర్వేదిపాలెం మొర్లకొడపకు చెందిన వైసీపీ నాయకులు జనసేన పార్టీలో మండల అధ్యక్షుడు గుబ్బల ఫణికుమార్ ఆధ్వర్యంలో చేరారు. కార్యక్రమంలో సలాది మూర్తి, పొన్నాల ప్రభ, బర్రే రాధాకృష్ణ, బొమ్మిడి మూర్తి, షైలా దుర్గాప్రసాద్, పెమ్మాడి సాయి, మత్స్యకార నాయకులతో పాటు జనసే, బీజేపీ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లను ఇబ్బందులకు గురిచేస్తే మూల్యం చెల్లించక తప్పదు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 15: రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా పెన్షనర్లను ఇబ్బందులకు గురిచేయలేదని... ప్రస్తుత ప్రభుత్వం ఎన్నో ఇక్కట్లకు గురిచేస్తోందని, అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశంలో పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 58నెలలుగా పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం డీఆర్, పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. అడిషనల్ క్వాంటమ్‌లో కోత విధించడంతో పాటు పెన్షనర్లను ఎన్నో విధాలుగా నష్టానికి గురిచేశారన్నారు. రాష్ట్రంలో 4లక్షల మంది పెన్షనర్లలో ఒక్కొక్కరు రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు నష్టపోయేలా చేయడం అన్యాయమన్నారు. 30నుంచి 40ఏళ్ల పాటుప్రభుత్వ సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన వారిపట్ల ఇలా వ్యవహరించడం ఆందోళనకరమని అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు పారుపూడి కృష్ణశాస్త్రి ఆవేదన వ్యక్తం చేశారు. కొంకాపల్లి ఏవీఆర్ నగర్‌లో కృష్ణశాస్త్రి అధ్యక్షతన సోమవారం పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సమావేశం నిర్వహించారు. తొలుత ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు సంఘ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఇటీవల మృతి చెందిన పెన్షనర్లకు సంతాపం తెలిపారు. ఉపఖజానా కార్యాలయానికి 150మంది ఇంకా లైఫ్ సర్టిఫికెట్లు సబ్మిట్ చేయలేకపోయారని, వారంతా వృద్ధులు, కదలలేని స్థితిలో ఉన్నందున తగిన చర్యలు తీసుకోవాలని ఎస్టీవోను సంప్రదించగా సానుకూలంగా స్పందించి ఆ విషయాన్ని వివరించారు. కోశాధికారి విజయశర్మ ఆర్థిక నివేదికను, ఎన్వీఎస్ఎస్‌సీహెచ్ కృష్ణమూర్తి భవన నివేదికను వివరించారు. భవన ఆధునికీకరణకు విశ్రాంత హిందీ పండితుడు సూతాపల్లి పాపారావు రూ.75వేలు అందించారు. కార్యాలయ గదికి పాపారావు పేరు పెట్టాలని సీనియర్ సభ్యుడు చిక్కం సూర్యనారాయణ ప్రతిపాదించగా ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈసందర్భంగా పాపారావును, రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన ఎన్వీఎస్ఎస్ సీహెచ్ కృష్ణమూర్తిని సత్కరించారు.



పాపారావును సన్మానిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

నూతన రామాలయ ప్రారంభ వేడుకలు

అంతర్వేది, ఏప్రిల్ 15: అప్పనరామునిలంక గ్రామం సుందరవారి మెరకలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. పండితులు మంగళంపల్లి బుల్లిబాబు అర్చక సారథ్యంలో ఆలయ నిర్మాత, హైదరాబాద్‌కు చెందిన ఫార్మసూటికల్ కంపెనీ అధినేత సుందర పుల్లయ్యనాయుడు-అంజనాదేవి దంపతులు రాములవారి కల్యాణాన్నినిర్వహించారు. సొంత ఊరిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని రూ.30లక్షలతో రామాలయాన్ని పునర్నిర్మించారు. సర్పంచ్ యిందుకూరి సుబ్బరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, మాజీ సర్పంచ్ బర్రే శ్రీనుపాల్గొన్నారు. ఆలయం వద్ద అన్నదానం జరిగింది.

వలంటీర్లు బలవంతపు రాజీనామాలు చేయవద్దు

మండపేట, ఏప్రిల్ 15: మండపేట నియోజకవర్గంలో వలంటీర్లు వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి రాజీనామాలు చేసి భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వలంటీర్లకు విజ్ఞప్తి చేశారు. రాజీనామాలు చేయని వలంటీర్లను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొనసాగిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వంలో వలంటీర్లకు రూ.10వేలు ఇస్తామన్నారు. బలవంతంగా రాజీమానాలు చేయిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, బలవంతపు రాజీనామాలు వెనక్కి తీసుకుని, నిజాయితీగా ప్రజలకు సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

అల్లవరం, ఏప్రిల్ 15: గుడాల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు వైసీపీ నాయకుడు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణారావు బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు అందించారు. సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు, దోనిపాటి ఆదిలక్ష్మి, ములపర్తి రామకృష్ణ, పొలమూరి రమేష్ కుమార్, దాసరి కుమారస్వామి, గంటా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 15: కొబ్బరి కార్మికుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ కోరారు. కొబ్బరి ఒలుపు, దింపు, ఇతర అనుబంధ కార్మికుల జిల్లా మహాసభను సోమవారం అమలాపురం ఎంప్లాయీస్ హోంలో నేదునూరి లోవరాజు అధ్యక్షతన నిర్వహించారు. కొబ్బరి కార్మికుల సమస్యలపై చర్చించారు. జిల్లాలో 30వేలమంది కార్మికులు కొబ్బరి అనుబంధ పరిశ్రమల్లో జీవనం సాగిస్తున్నారని, వారికి ఎటువంటి సంక్షేమ పథకాలు అందట్లేదన్నారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నేదునూరి లోవరాజు, ప్రధాన కార్యదర్శిగా బొక్కా వసువులు, కోశాధికారిగా పాతాల శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా గుదే దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడిగా దాకారపు సత్యప్రకాష్, నల్లా దేవళస్వామి, కేవీవీ సత్యనారాయణ, గుత్తాల రమణ, సహాయ కార్యదర్శులుగా మాదే శ్రీనుబాబు, కొండేటి లక్ష్మణరావు, కొడమంచిలి శ్రీనివాసరావు, నామాడి సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

గల్ఫ్ యువనేస్తం సేవాసమితి సాయం

మలికిపురం, ఏప్రిల్ 15: లక్కవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న గుబ్బల గోకనకేశ్వరరావుకు సోమవారం గల్ఫ్‌యువనేస్తం సేవాసమితి రూ.42 వేలు సహాయం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణార్జునులు, సత్తిబాబు, గోవర్ధనపద్మకుమారి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.1.60లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్15: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా రూ.1,60,971ఆదాయం వచ్చినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్‌తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో బుచ్చిబాబు, హరీష్‌మాధుర్

ముమ్మిడివరం, ఏప్రిల్ 15: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ముమ్మిడివరం నియోజకవర్గం రూ.1800కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తిచేసి అగ్రస్థానలో నిలిపామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. అయినాపురంలో సోమవారం పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్ మాధుర్, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా దాట్ల బుచ్చిబాబు, గంటి హరీష్‌మాధుర్‌లకు గ్రామంలో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. పార్లమెంటు కూటమి అభ్యర్థి హరీష్ మాధుర్ మాట్లాడుతూ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్-6 పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. గ్రామంలో వైసీపీకి చెందిన సంసాని అశోక్, యల్లమిల్లి చంటి, మోకా దుర్గాప్రసాద్, మోకా శ్యామలరావు, మోకా శ్రీను, పరమట పండు, కొమ్మాబత్తుల అశోక్, పరమట నాగరాజు, జనిపల్లి మహేష్, గెద్దాడి వివేక్‌లతో పాటు మరో 20మంది పార్టీలో చేరగా వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, పొత్తూరి విజయభాస్కరవర్మ, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటిరమణకుమార్, బొంతు నాగరాజు, చిక్కాల అంజిబాబు, మట్ట సత్తిబాబు, దాట్ల పృథ్వీరాజ్, అయ్యల శ్రీను, నడిమింటి సూర్యప్రభాకరం, కోరశిక రాము, సత్తి నూకరాజు, దంగేటి శ్రీను, యిందుకూరి పాండురంగరాజు, బొక్కా ధర్మారావు, సానబోయిన శ్రీను, మట్ట సూరిబాబు, పచ్చుమట్ల రామకృష్ణరాజు, యనమదల సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రామ వలంటీరు టీడీపీలో చేరిక



ఆలమూరు, ఏప్రిల్ 15: జొన్నాడ గ్రామ వలంటీరు యామన సతీష్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి సోమవారం టీడీపీలో చేరాడు. సతీష్‌కి కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేత తాడి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వంతుల వారీగా సాగునీరు

అంబాజీపేట, ఏప్రిల్15: ముక్కామల లాకుల ద్వారా సాగు చేసే భూములకు మంగళవారం నుంచి బుధవారం వరకు 24 గంటల పాటు వంతుల వారీగా సాగునీరు అందిస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ నవీన్‌కుమార్ తెలిపారు. నేదునూరు, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, కె.పెదపూడి, గంగలకుర్రు, మొసలపల్లి, సావరం, గ్రామాలకు చెందిన రైతులు పంటబోదెలను శుభ్రం చేసుకుని సాగునీటిని పూర్తిస్థాయిలో అందేలా చూసుకోవాలన్నారు.

ఎన్నికల అధికారిని కలిసిన సర్పంచ్‌ల సమాఖ్య కార్యదర్శి

మలికిపురం, ఏప్రిల్ 15: రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు వెంటనే జమ చేసేలా ఆదేశాలివ్వాలంటూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, పంచాయితీ సర్పంచ్‌ల సంఘం ఎన్నికల కమిషన్ అధికారి ముకేష్‌కుమార్ మీనాకు వినతిపత్రం సమర్పించినట్టు విశ్వేశ్వరాయపురం సర్పంచ్, పంచాయతీరాజ్ సర్పంచ్‌ల సమాఖ్య కార్యదర్శి చెల్లుబోయిన హెలీన తెలిపారు. 14,15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8,629కోట్లను రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాం విరుద్ధంగా, చట్ట వ్యతిరేకంగా సర్పంచ్‌ల సంతకాలు లేకుండా పంచాయతీ తీర్మానాలు లేకుండా దారి మళ్లించిందన్నారు. చాంబర్ నాయకులు వైవీవీ రాజేంద్రప్రసాద్, ప్రతాపరెడ్డి, పగడాల రమేష్, వానపల్లి లక్ష్మీముత్యాలుతో కలిసి వినతిపత్రం అందజేసినట్టు ఆయన తెలిపారు.

హోం ఓటింగ్‌పై అధికారులకు అవగాహన

రాయవరం, ఏప్రిల్15: స్థానిక తహశీల్దారు కార్యాలయంలో హోం ఓటింగ్‌పై అధికారులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్వో డీవీఎస్ ఎల్లారావు మాట్లాడుతూ అధిక అంగవైకల్యం ఉన్నవారికి, 85ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి దగ్గర నుంచే ఓటు వేసే విధంగా హోం ఓటింగ్ సౌకర్యాన్ని ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిందన్నారు. తహశీల్దారు ఆర్వీ కృష్ణారావు, డిప్యూటీ తహశీల్దారు జానకి రామయ్య, ఆర్ఐ పంపన రామారావు, బీఎల్‌వోలు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొమరగిరిపట్నంలో ఎన్నికల ప్రచారం

అల్లవరం, ఏప్రిల్ 15: కొమరగిరిపట్నంలో అమలాపురం అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రచారం చేశారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, కొనుకు బాపూజీ, తిక్కా వెంకటప్రసాద్, రుద్రరాజు నానిరాజు, అల్లూరి సురేష్‌రాజు, గునిశెట్టి చినబాబు, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, నామన భాస్కర సిద్ధాంతి, నిమ్మకాయల శేఖర్, ఆకుల మధు, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పులుసుగంటి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 15: అగ్ని ప్రమదాల పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకుని, ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముమ్మిడివరం ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి మురళీకొండబాబు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక బస్టాండు, మార్కెట్ సెంటర్, బళ్లగేటు సెంటర్లలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్ నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కేఎస్ఎస్ నారాయణ, కె.శ్రీనుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రులో నేత్ర దానం

కె.గంగవరం, ఏప్రిల్15: చెల్లూరుకు చెందిన మార్ని వీరేశ్వరాంబ(78) పామర్రులో కుమార్తె ఇంటి వద్ద అనారోగ్యంతో మరణించారు. కుటుంబ సభ్యుల అనుమతితో కరుటూరి వెంకటరత్నం ప్రోత్సాహంతో నేత్ర దానానికి అంగీకరించారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు ప్రతినిధులు నేత్రాలు సేకరించారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులను గ్రామస్థులు అభినందించారు.

కూటమి అభ్యర్థులకే మాదిగల మద్దతు



ఎంపీ అభ్యర్థి హరీష్‌ను కలుసుకున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 15: కూటమి అభ్యర్థులకే మాదిగల సంపూర్ణ మద్దతు ఉంటుందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. అమలాపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌ను సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు కలుసుకుని సంఘీభావం ప్రకటించారు. పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు కాప నాగభూషణం, బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్లు తొత్తరమూడి ప్రభాకరరావు, ఉందుర్తి సత్యనారాయణ, మంద వెంకటేశ్వరరావు, నేదునూరి వెంకట్రావు, తొత్తరమూడి సాయిబాబు, సవరపు సూర్యనారాయణ, పెదపూడి పవన్‌కుమార్, పెదపూడి వీరభద్రరావు, కార్యదర్శి చాట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్స్‌కు చేరుకున్న ఈవీఎంలు



పి.గన్నవరం, ఏప్రిల్15: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పి.గన్నవరం నియోజకవర్గంలోని 212 పోలింగ్ కేంద్రాలకు ముంగండ హైస్కూల్ నుంచి ఈవీఎంలు పంపిణీ చేస్తారు. సోమవారం పార్లమెంట్‌కు సంబంధించి 254కంట్రోల్ యూనిట్లు, 254బ్యాలెట్ యూనిట్లు, 275వివిప్యాడ్లు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. వీటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి రాజకీయ నాయకుల సమక్షంలో శీలు వేస్తామన్నారు. అసెంబ్లీకు సంబంధించిన ఈవీఎంలు మంగళవారం రానున్నట్లు ఆయన తెలిపారు. రాజకీయ నాయకుల సమక్షంలో ఈవీఎంలను ముంగండ హైస్కూల్‌లో స్ట్రాంగ్‌రూమ్స్‌కు తరలించారు. సహాయ రిటర్నింగ్ అధికారి షేక్ హుస్సేన్, తహశీలార్లు ప్రెమద్వార, ఎం.మెరికమ్మ, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, డిప్యూటీ తహశీల్దార్ డి.శ్రీనివాస్, రాజకీయ పార్టీల నాయకులు చిట్టాల రామజోగేశ్వరరావు, చెరుకూరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

మండపేట, ఏప్రిల్15: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండపేట మండల పరిషత్ సమావేశం ఎంపీపీ ఉండమట్ల వాసు అధ్యక్షతన జగిగింది. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు. వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు అధికారులను కోరారు. వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, ప్రత్యేకాధికారి రామకృష్ణ చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో సమావేశం నిర్వహించినట్టు ఇన్‌చార్జీ ఈవోపీఆర్డీ రాజు తెలిపారు. సమావేశంలో పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. వేసవి నేపథ్యంలో పంచాయతీల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశామని అధికారులు చెప్పారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 15: పి.గన్నవరం మండలం మానేపల్లి శివారు శివాయలంక-పెదకందాలపాలెం ఆనుకుని ఉన్న లంక భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలకు తక్షణం అడ్డుకట్ట వేసి మాఫియాపై సివిల్, క్రిమినల్ చర్యలు చేపట్టాలని కోరుతూ నేతాజీ సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షుడు పుల్లెల సత్యనారాయణమూర్తి సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ అందజేశారు. అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి వెళ్తే దౌర్జన్యాలకు దిగుతున్నారన్నారు. ఇసుక తవ్వకాలను అడ్డుకుని పర్యావరణాన్ని రక్షించడంతో పాటు ఎస్సీ వర్గాలకు చెందిన కొబ్బరి తోటలు కోతకు గురికాకుండా చూడాలని వినతిపత్రంలో కోరారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: శ్రీరంగనీతులు
వెంకటరమణ	:బడేమియా చోటేమియా
శ్రీలలిత	: లవ్‌గురు
శేఖర్ స్క్రీన్-1	: గీతాంజలి మళ్లీ వచ్చింది
శేఖర్ స్క్రీన్-2	: మంజుమ్మల్ బాయ్స్
రమా	: డీజేటిల్లు స్క్వేర్
గణపతి	: ఓంభీమ్‌బుష్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: ఫ్యామిలీ స్టార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గాడ్జిల్లా అండ్‌కాంగ్